VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 15 జూలై 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 352

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## జల వివాదం.. తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు

దిల్లీ: జల వివాదంపై చర్చకు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 16న దిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కావాలని కేంద్రం కోరింది. ఈ మేరకు వీరిద్దరిని ఆహ్వానిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ భేటీకి హాజరయ్యేందుకు ఇద్దరు సీఎంలకు వీలవుతుందో లేదో తెలపాలని పేర్కొంది.మరోవైపు కృష్ణా, గోదావరి వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై రాష్ట్రంలోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని సీఎం కోరనున్నారు. దిల్లీ వెళ్లనున్న ఏపీ సీఎం చంద్రబాబుఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం దిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అక్కడికి చేరుకోనున్నారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. ఈనెల 17న రాత్రి 9 గంటలకు తిరిగి విజయవాడకు చంద్రబాబు చేరుకోనున్నారు.




## కాలంకాదు.. కాంగ్రెస్ కాటేస్తోంది

### కాళేశ్వరం ఎత్తిపోతలపై తీవ్రనిర్లక్ష్యం

### రైతులు ప్రశ్నిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

### ఎక్స్ వేదికగా కెటిఆర్ ఘాట విమర్శలు

కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా కక్షగట్టిన సర్కార్ నిర్లక్ష్యం మూలంగా కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయి. అద్దాలమేడలో ఊరేగుతున్న అబద్దాల కాంగ్రెస్ మూలంగా అంధకారంలో తెలంగాణ రైతన్న ఆందోళన చెందుతున్నాడు.






# రేషన్ కార్డు..పేదవాడి ఆత్మగౌరవం

### పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు

### పేదలకు సన్నబియ్యం ఊసే ఎత్తలే

### కొత్తగా 3. 58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ

### కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి

### బీఆర్ఎస్ హయాంలో బెల్ట్ షాపులకే ప్రాధాన్యం

### రైతులకు రుణమాఫీ...బోనస్ ఇచ్చిన ఘనత మాది

కెసిఆర్ కట్టిన కాళేశ్వరం..కూలేశ్వరంగా మారింది ఇందుకు వారిని అక్కడే ఉరితీసినా నష్టం లేదు నల్లగొండ జిల్లా తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీ బిఆర్ఎస్ తీరుపై ఘాటు విమర్శలు చేసిన సిఎం రేవంత్

## కలుషిత ఆహారం తిని 52 మంది విద్యార్థినులకు అస్వస్థత



దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

దేవరకొండ: కలుషిత ఆహారం తిని వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో 52 మంది విద్యార్థినులు ఆసుపత్రి పాలైన ఘటన నల్గొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండ గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనతో ఒక్కసారిగా జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో కలకలం రేగింది. ఆశ్రమ పాఠశాలలో 408 మంది విద్యార్థినులుండగా..శని, ఆదివారం సెలవు కావడంతో 310 మంది మాత్రమే పాఠశాలలో ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం వండిన క్యాబేజి కూరను రాత్రి చికెన్ కూరతో కలిపి వడ్డించినట్లు విద్యార్థినులు చెబుతున్నారు. సాయంత్రం ఇచ్చిన స్నాక్స్‌లో బొబ్బర్లు ఉడికించకుండా వేయించి ఇచ్చారని.. దీంతో రాత్రి కొంత మందికి కడుపునొప్పి వచ్చినా అలానే పడుకున్నారని తెలిపారు. కాగా, ఉదయం ఉడికీ ఉడకని పులిహోర తినడంతో విద్యార్థినులకు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు అయి ఉండొచ్చని వైద్యులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో ఎస్‌డీ డానియల్ వసతి గృహాన్ని, ఆసుపత్రిని సందర్శించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తూ పట్టించుకునే వారు లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.




## వెన్నాడుతున్న కెసిఆర్ పాలనా వైఫల్యాలు

### ఎపి ప్రాజెక్టులను పట్టించుకోకుండా ఇప్పుడు విమర్శలు

### వ్యవసాయారంగాన్ని అభివృద్ధి చేయడం కాంగ్రెస్ లక్ష్యం

### పాలేర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసిన భట్టి,పొంగులేటి

## వైద్యుల కాపురంలో రీల్స్ చిచ్చు....

### - లేడీ డాక్టర్ సూసైడ్.

**వరంగల్:** హనుమకొండ జిల్లా హసన్ పర్తిలో యువ వైద్యురాలు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త మరో యువతితో ప్రేమాయ ణం సాగించినందుకే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి ఆరోపించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హసన్ పర్తిలోని ఓ విల్లాలో కార్డియాలజీ వైద్యుడు డాక్టర్ సృజన్, అతని భార్య డెంటల్ సర్జన్ డాక్టర్ ప్రత్యూషతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇటీవలే ప్రైవేట్ హాస్పిటల్ లో కార్డియాలజీ విభాగంలో విధుల్లో చేరిన సృజన్ కు రీల్స్, ప్రమోషన్స్ చేస్తా నంటూ బానోతు శృతి అలియాస్ బుట్టబొమ్మ



పరిచయమైంది. క్రమంగా వారిద్దరి మధ్య స్నేహం పెరగడంతో డాక్టర్ సృజన్ అతని భార్య ప్రత్యూష మధ్య గొడవలు మొదలయ్యా యి. గొడవ కాస్త ముదరడంతో డాక్టర్ సృజన్ భార్యకు విడాకులు ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో గొడవ ముదరడంతో ఆదివారం ఉదయం ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. దీంతో మనస్తాపం చెందిన డాక్టర్ ప్రత్యూష ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య కుపాల్పడింది. బుట్ట బొమ్మ అలియాస్ బానోతు శృతి వల్లే తన కూతురు జీవితం ఆగమైందని, కూతురు మృతిపై అనుమానాలు ఉన్నాయని

ఆమె తండ్రి రామ్ కిషన్

ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


## ముగిసిన హర్యానా గవర్నర్ దత్తాత్రేయ పదవీకాలం

### గోవా గవర్నర్‌గా అశోకగజపతి రాజు

### కొత్తగా ముగ్గురు గవర్నర్ల నియామకం

### ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్రపతి ముర్ము

2లో..



## విద్వేష పూరిత ప్రసంగాల కట్టడికి చర్యలు



న్యూఢిల్లీ: విద్వేషపూరిత ప్రసంగాల కట్టడికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా చూడాలని కూడా స్పష్టం చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా.. విద్వేషపూరిత ప్రసంగాలను నిలువరించే మార్గాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు కోరింది.వాక్ స్వాతంత్య్ర విలువను పౌరులు తెలుసుకోవాలని, ఇలాంటి వ్యవహారాల్లో సంయమనం పాటించాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠా పనోలీపై ఫిర్యాదు చేసిన వజహత్ ఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

విద్వేష ప్రసంగాలు చేసే వారికి అవి ఎంత అసభ్యకరంగా, అనుచితంగా ఉంటున్నాయో ఎందుకు అర్థం కావట్లేదని పేర్కొంది.



## 'శుభ' స్వాగతం!

దిల్లీ: రోదసిలో 18 రోజులు గడిపి, మానవాళికి ప్రయోజనం కలిగించే అనేక ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా మంగళవారం భూమికి తిరిగి రానున్నారు. ఆయన, యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఉన్న మరో ముగ్గురు వ్యోమగాములు సోమవారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వీడ్కోలు పలికి డ్రాగన్ గ్రేస్ వ్యోమనౌకలో తిరుగుప్రయాణమయ్యారు. ఇరవై రెండున్నర గంటల ప్రయాణం తర్వాత భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో సాగరంపై ఈ వ్యోమనౌక దిగుతుంది.

## అధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి



సన్మాన సభలో కార్యకర్తలకు రామచంద్రరావు సూచన



నల్లగొండ:తెలంగాణలో భాజపా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు విజయ సంకల్పం తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో కలసి పనిచేయాలన్నారు. బిజెపి చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని

అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా చౌటు-ప్పల్‌కు వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం నిర్వహించిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్‌ను ఎందుకు ఎన్నుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. భాజపా ప్రభుత్వం మాత్రమే తెలంగాణలో స్వర్ణయుగం తెస్తుంది. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో మాత్రమే తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. గత భారాస ప్రభుత్వం అవినీతిమయమైంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల్ని ఇబ్బందులు పెడుతోంది. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా భాజపా వైపు చూస్తున్నారని రామచందర్‌రావు అన్నారు.

వేగుచుక్క

# గోవా గవర్నర్‌గా అశోకగజపతి



న్యూఢిల్లీ:రాష్ట్రపతి ద్రౌపదీముర్ము మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్లను నియమించారు. గోవా గవర్నర్‌గా తెదేపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు నియమితులయ్యారు. హరియాణా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషిమ్‌కుమార్ ఘోష్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తాను నియమించారు. హర్యానా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ప్రొఫెసర్ ఆషిమ్‌కుమార్ ఘోష్ నియమితులయ్యారు. అలాగే తెలుగు రాష్ట్రానికి చెందిన గజపతి రాజు గోవా గవర్నర్‌గా నియమితులు కావడం విశేషం. ఈ మేరకు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు హరియాణా గవర్నర్‌గా పనిచేసిన బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగిసింది. అలాగే మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన విద్యాసాగర్ రావు పదవీకాలం కూడా గతంలోనే ముగిసింది. ఆయనకు మళ్లీ పొడిగింపు ఇవ్వలేదు. ఇప్పుడు దత్తాత్రేయకు కూడా పొడిగింపు లేదని స్పష్టమయ్యింది. ఇకపోతే విజయనగరం జిల్లా ప్రజలకు, రాష్ట్ర రాజకీయ వర్గాలకు పరిచయం అక్కర్లేని పేరు పూసపాటి అశోక్ గజపతిరాజు. విజయనగర సంస్థానాధీశుల వారసుడై అయినప్పటికీ రాచరికపు పోకడలకు దూరంగా ఉంటూ నిరాడంబర ప్రజానాయకుడిగా అశోకగజపతి రాజు గుర్తింపు పొందారు. నీతి, నిజాయతీలకు నిలువుటద్దంగా నిలిచారు. నమ్మిన సిద్ధాంతాలకు తుది దాకా కట్టుబడే నైజం అశోక్ సొంతం. విజయనగరం మహారాజు అయిన డాక్టర్ పీవీజీ రాజు కుమారుడైన అశోక్ గజపతి రాజు జిల్లా ప్రజలకు రాజుగారిగా చిరపరిచితులు. జిల్లా తెదేపా శ్రేణులు ఆయనను పెద్దాయనగా గౌరవించి ఆ పేరుతోనే సంబోధిస్తుంటాయి. అశోక్ గజపతిరాజు 1951 జూన్ 26న జన్మించారు. గ్వాలియర్‌లోని సింధియా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, విశాఖలోని ప్రభుత్వ కృష్ణా కళాశాలలో చదువుకున్నారు. పుట్టింది రాజవంశంలోనే అయినా సామ్యవాద భావాలను చిన్నప్పటి నుంచే పుణికి పుచ్చుకున్నారు. విద్యార్థి దశలో కూడా ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వ దమనకాండను నిరసిస్తూ ప్రత్యక్ష రాజకీయ అరంగేట్రానికి తెరతీశారు. జయప్రకాశ్ నారాయణ, జార్జ్ ఫెర్నాండెజ్, చంద్రశేఖర్ వంటి సోషలిస్టు నాయకుల ఉపన్యాసాలకు ఎక్కువగా అశోక్ ప్రభావితమయ్యారు. 1978లో మొట్టమొదటిసారిగా జనతా పార్టీ తరఫున విజయనగరం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు.. 1982లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరారు. నాటి నుంచి ఆ పార్టీలో కీలక సభ్యుడిగా కొనసాగారు. ఆ పార్టీ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి ఎంపీగా విజయం సాధించారు. 1983, 1985, 1989, 1994, 1999, 2009లో తెదేపా తరఫున గెలిచారు. 2014లో అదే పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ- చేసి జయకేతనం ఎగురవేశారు. 2014లో కేంద్ర ప్రభుత్వంలో పౌరవిమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం మంజూరు విషయంలో కీలకంగా వ్యవహరించారు. అశోక్ సతీమణి సునీల గజపతిరాజు విజయనగరం మున్సిపల్ ఛైర్పర్సన్‌గా సేవలందించారు. అశోక్ గజపతిరాజుకు అదితి గజపతిరాజు, విద్యా గజపతిరాజు కుమార్తెలు. అదితి గజపతిరాజు ఇప్పుడు టిడిపి తరఫున ఎమ్మెల్యేగా ఉన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో ఎక్సైజ్, వాణిజ్య, ఆర్థిక, రెవెన్యూ, శాసనసభా వ్యవహారాల శాఖల మంత్రిగా సేవలందించారు. ప్రస్తుతం తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఆయన కొనసాగుతున్నారు. 2024 ఎన్నికల్లో అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు విజయనగరం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ముక్కుసూటి తనం వల్ల అప్పుడప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నా ఆయన తన వైఖరిని మార్చుకోలేదు. అశోక్ గజపతిరాజుకు క్రీడలంటే చాలా ఇష్టం. ఒక దఫా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. ఆయన తన పనులను తానే చేసుకోవడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. రోజూ ఉదయం తన కారును తానే తుడుచుకుంటారు. మొక్కలకు నీళ్లు పెట్టడం ఆయన దినచర్యల్లో ఒక భాగం. చివరకు తన పాదరక్షలను కూడా తానే శుభ్రం చేసుకుంటారు. పాదాభివందనాలకు ఆయన ఆమడదూరంలో ఉంటారు. పొగడ్తలను సహించరు. ఇకపోతే ఎన్‌డిఏలో టిడిపి కీలక భాగస్వామి కావడంతో అశోకగజపతికి గవర్నర్ పదవి దక్కింది. చంద్రబాబు కీలకంగా వ్యవహరించి తన నమ్మిన బంటుకు గవర్నర్ పదవి ఇప్పించుకున్నారు.

# పేర్ని నాని వ్యాఖ్యలు దుర్మార్గం




అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై హోంమంత్రి అనిత ఘాటుగా స్పందించారు. రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకురావడానికి రోజూ 18 గంటలు కష్టపడుతున్న వ్యక్తిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తున్నారంటూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరికి అదర్శంగా ఉండాలి కానీ.. ఇలాంటి పదాలు మాట్లాడకూడదని హితవుపలికారు. ఇకపోతే గతంలో ఏపీ ఓ గంజాయి హబ్‌గా ఉండేదని హోంమంత్రి వంగలపూడి అని అన్నారు. సోమవారం నాడు హోంమంత్రి అనిత సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు ఏపీలో ఉన్నాయని చెప్పేవారని.. అయితే గత ఏడాది కాలంగా తాము చేసిన కృషి కారణంగా రాష్ట్రంలో గంజాయిని నియంత్రించగలిగామన్నారు. గతంలో అరకు, పాడేరు ప్రాంతాలు గంజాయి హబ్‌గా ఉండేవని.. ప్రస్తుతం అరకు అంటే కాఫీ గుర్తొచ్చేవిధంగా మార్చివేసినట్లు హోంమంత్రి అనిత తెలిపారు. అరకును కాఫీ బ్రాండ్‌గా తీర్చిదిద్దినట్లు- చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, ఈగల్ టీమ్ కలిసి పనిచేసి మార్పును తీసుకొచ్చాయని వివరించారు. పార్లమెంట్ వంటి ఉన్నత స్థానాల్లోనూ అరకు కాఫీని ప్రమోట్ చేయగలిగినట్లు వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఈగల్ పేరును సూచించారు. ఈగల్ టీ-మ్ సభ్యులు సమర్థంగా పనిచేస్తున్నారు. ప్రత్యేకంగా టీ-మ్‌లు ఏర్పాటు- చేసుకొని గంజాయిపై ఉక్కుపాదం మోపాం అని హోంమంత్రి అనిత వివరించారు. ఈగల్ స్థాపించినప్పటి నుంచి రవికృష్ణను డైరెక్టర్‌గా చేసి వర్క్‌ను ప్రారంభించామన్నారు. వైజాగ్ , విజయవాడ, రాజమండ్రిలో మూడు ఈగల్ టీంలు పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. ఏజెన్సీ నుంచి వచ్చే రూట్లలో సీసీ కెమెరాలు, చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని.. ఈరోజుకు 831 గంజాయి కేసులు నమోదు చేశామని వెల్లడించారు. గత ప్రభుత్వంలో స్కూలు బ్యాగుల్లోకి గంజా ప్యాకెట్‌లు వెళ్లిపోయాయని హోంమంత్రి విమర్శించారు. నాటి నుంచి నేటి వరకు కూడా ఒక యజ్ఞం తరహాలో గంజాయి నిర్మూలనకు పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ఈగల్ టీంలు రోజుకు ఒక్కచోట అయినా క్లాస్‌లు ఏర్పాటు చేశారన్నారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ అని ఈగల్ టీం ప్రారంభించిందని చెప్పారు

. క్యాట్పా యాక్టు ప్రకారం విద్యాసంస్థలకు సమీపంలో 100 మీటర్ల వరకు పొగాకు సంబంధిత వస్తువులు అమ్మకూడదని చెపుతున్నారన్నారు. మెడిసిన్‌లు, వైట్‌నర్, ఇంజక్షన్‌లు వాడుతున్నారని ఆపరేషన్ గరుడలో భాగంగామెడికల్ షాపులపై దాడులు చేశామన్నారు. ప్రిస్కిప్షన్‌లు లేకుండా అమ్మకుండా చూడాలని మెడికల్ షాపు యజమానులకు చెప్పామని తెలిపారు. గంజాకంటే వేరే పంటలు పండిస్తే అంతకు మించి డబ్బులొస్తాయని చెప్పి 40 లక్షల ప్రత్యామ్నాయ మొక్కలను పంపిణీ చేశామని వెల్లడించారు. 20 వేల ఎకరాల్లో ఉండే గంజాయిని ఇప్పుడు 90 ఎకరాల్లో కూడా లేకుండా చేశామని... జీరో కల్టివేషన్‌కు తీసుకువచ్చామని చెప్పారు. సిల్వర్ ఓక్‌కు మూడు సంవత్సరాలు పడుతుందన్నారు. వాటి మధ్య ఇంటర్ క్రాప్‌లను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. 2024 నాటికి 68,620 కిలోలు గంజాయిని నాశనం చేశామని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

# హైకోర్టు సీజేగా జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్



హైదరాబాద్: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ నియమితులయ్యారు. మే 26న సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో సోమవారం కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 222(1)కింద ఉన్న అధికారాలను అనుసరించి భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదించి ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్‌ను తెలంగాణకు బదిలీ చేయడానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇది వరకు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఆలోక్ అరాధే ఈ ఏడాది జనవరి 21న బాంబే హైకోర్టుకు బదిలీ అయిన తర్వాత ఇప్పుడే పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తి నియామకం జరిగింది.


## పూజలు సక్రమంగా జరిపించడం లేదు

**రంగంలో భవిష్యవాణి మాతంగి స్వర్ణలత**

హైదరాబాద్:సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల జాతరలో ప్రధాన ఘట్టమైన రంగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. ఈ ఏడాది వర్షాలు తప్పకుండా కురుస్తాయని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని చెప్పారు. రాబోయే రోజుల్లో మహమ్మారి వెంటాడుతుందని, అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయని తెలిపారు. జాగ్రత్తగా ఉండాలని భక్తులను హెచ్చరించారు. రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడే భారం తనదని చెప్పారు. బాలబాలికలను మీరు విచ్చలవిడిగా వదిలేస్తున్నారని, కానీ నేను కడుపులో పెట్టుకుని కాచుకుంటున్నాని చెప్పారు. కాలం తీరితే ఎవరు ఏది అనుభవించాలో అది అనుభవిస్తారని, తాను అడ్డురానని పేర్కొన్నారు. 'బోనాల జాతరకు సంతోషంగా సాకలు పోసి బాగా చేశారు. ప్రతీసారి చేసినట్టే ఈ సారి కూడా పొరపాటు చేశారు. ప్రతి సంవత్సరం చెబుతునా.. నా బిడ్డలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటాను. నా పూజలు అన్ని సక్రమంగా జరిపించాలి. వేల రాసులు నేను రప్పించుకుంటున్న.

నాకు రక్తం బలి ఇవ్వడం లేదు. మీరు మాత్రం ఆరగిస్తారు. నాకు మాత్రం ఇవ్వడం లేదు.. నాకు సరిగ్గా పూజలు చెయ్యకపోతే రక్తం కక్కుకొని చస్తారు. నాకు పూజలు సరిగ్గా జరిపించడం లేదు.. అందుకే మరణాలు పెరుగుతున్నాయి. నేను అస్సలు ఆ విషయంలో అడ్డుపడను. నాకు రక్తం బలి కావాలి. నన్ను కొలిచే వారికి నేను ఎప్పుడు తోడుగా నిలబడుతాను. రాబోయే రోజుల్లో మహమ్మారి వస్తుంది. ప్రజలు జాగ్రత్త ఉండాలి. అగ్ని ప్రమాదాలు బాగా జరుగుతాయి. ఈ సంవత్సరం కూడా వర్షాలు బాగా కురుస్తాయి. ఐదు వారాలు పాటు- నాకు పూజలు, సాక పోసి ఆనంద పరచాలి. నాకు రక్తం చూపించండి లేకపోతే అల్లకల్లోలం జరుగుతుంది. నా రూపాన్ని పెట్టడానికి కూడా అడ్డుపడుతున్నారు.' అని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.

# రేషన్ కార్డు.. పేదవాడి ఆత్మగౌరవం



నల్గొండ:బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. పేదవాడికి సన్న బియ్యం ఇచ్చి.. గుక్కెడు ముద్ద పెట్టాలని ఆలోచన సైతం గత ప్రభుత్వంలోని పెద్దలు చేయలేదని మండిపడ్డారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన.. రూ. 34. 20 కోట్ల విలువైన పనులు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాతో కాంగ్రెస్ పార్టీకి విడదీయరాని బంధం ఉందని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి అన్నారు. రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం గుర్తింపు అన్నారు. ఆకలి తీర్చే ఆయుధమని తెలిపారు. తెలంగాణలో కొత్తగా 3. 58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నట్లు- వివరించారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి చేకూరతుందన్నారు. తెలంగాణలో మొత్తం 95. 56 లక్షల మంది రేషన్ కార్డులు అందుకున్నారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి విపులీకరించారు. నల్గొండ చరిత్రే.. తెలంగాణ చరిత్ర అని కొనియాడారు. జిల్లా అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపులు తెరవలేదని.. బెల్ట్ షాపులు తెరిచారంటూ వ్యంగ్యంగా అన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తుంటే.. ఓర్వ లేక తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయంటూ మండిపడ్డారు. రైతు పండించిన పంటను కొనుగోలు చేస్తున్నామని.. రైతుకు బోనస్ సైతం ఇస్తున్నామని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నేడు నల్గొండ జిల్లాకు నీళ్లు వస్తున్నాయని గుర్తు చేశారు. పోరాట యోధులను అందించిన గడ్డ నల్గొండ అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పిన తమ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. అయితే తమ ప్రభుత్వం రైతు భరోసా ఎగ్గొట్టిందంటూ దుష్ప్రచారం చేశారని ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతులకు రైతు భరోసా నగదు అందించామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రవేశపెట్టి మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ. 6, 500 కోట్లు ఖర్చు అయిందని వివరించారు. తమ ప్రభుత్వం కొలువు తీరి రెండేళ్లు పూర్తయ్యే సరికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం.. ఆయన హయాంలోనే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. కూలేశ్వరం ప్రాజెక్టు దగ్గరే వారిని ఉరి తీసినా తప్పు లేదన్నారు. ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా? అంటూ బీఆర్ఎస్ నేతలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మూడు అడుగులున్న స్థానిక నేత ఎగిరెగిరి పడుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లు అవకాశం ఇచ్చినా తుంగతుర్తికి నీళ్లు ఎందుకు తేలేదంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని సీఎం సూటిగా ప్రశ్నించారు. తుంగతుర్తికి నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదంటూ బీఆర్ఎస్ నేతకు ఈ సందర్భంగా చురకలంటించారు. దొర ముందు చేతులు కట్టుకుని గ్లాస్‌లో సోడా పోయడమే నీకు తెలుసంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై మండిపడ్డారు. సొంత మండలానికి ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీస్‌లే కాదు.. పోలీస్ స్టేషన్ సైతం తెచ్చుకోలేని ఘనత బీఆర్ఎస్ నేతలదంటూ వ్యంగ్యంగా అన్నారు. . నాడు గంజికి లేని మూడు అడుగుల నాయకుడు.. నేడు బెంజి కార్లలో తిరుగు తున్నారంటూ జగదీశ్వర్ రెడ్డిపై వ్యంగ్య బాణాన్ని సీఎం రేవంత్ రెడ్డి సంధించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు రేషన్ కార్డు, సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన బీఆర్ఎస్ నేతలకు రాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేశామని.. రేషన్ దుకాణాల వద్ద జనాలు బారులు తీరుతున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇచ్చామని.. వ్యవసాయం దండగ కాదు.. పండగలా చేశామన్నారు. దేశం తలెత్తుకునేలా వరి ధాన్యం ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. రైతు రాజు అయినప్పుడే ఇందిరమ్మ ఆత్మశాంతిస్తుందని ఆసక్తిక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం సహాయక సంఘాలను పట్టించుకోలేదు. మేము అధికారంలోకి వచ్చిన తరువాత స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంకులు అప్పగించాం. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. మూడు అగుడుల వ్యక్తి నన్ను అడ్డుకుంటానని అంటున్నాడు. గ్లాసులో సోడా పోసినంత ఈజీ కాదు.. గోదావరి నీళ్లు తేవడం. ఒక్కసారి అడ్డుకుని చూడు, మా దామన్న చూసుకుంటాడని వ్యాఖ్యానించారు.

# కుట్రలు, కుతంత్రాలే వైకాపా ధ్యేయం



ఒంగోలు: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో మంత్రి డీబీవీ స్వామితో కలిసి పర్యటించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. 33/1 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. కుట్రలు, కుతంత్రాలే ధ్యేయంగా వైకాపా వ్యవహరిస్తోందని విమర్శించారు. పల్నాడు, బంగారుపాళ్యం, గుడివాడ వంటి ఘటనలు జగన్ కుతంత్రాల్లో భాగమే అన్నారు. ఇకపోతే పేర్ని వ్యాఖ్యలు దుర్మార్గమని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదని,ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. జగన్ పాలనలో విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, తమ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టి ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని తెలిపారు. సోలార్ విద్యుత్ పరిశ్రమల ఏర్పాటు ద్వారా విద్యుత్ కొరతను అధిగమించేలా చర్యలు చేపడతామని చెప్పారు. మంత్రి డీబీవీ స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగితేనే జగన్ కుట్రలను ఛేదించగలమని చెప్పారు. అరాచకం-విధ్వంసంతో జగన్ చేసే కుట్రలను అభివృద్ధి-సంక్షేమంతో తిప్పికొడతామన్నారు.

# వెన్నాడుతున్న కెసిఆర్ పాలనా వైఫల్యాలు



ఖమ్మం: కేసీఆర్ పాలనలో చేసిన తప్పిదాలకు నేడు తమ ప్రభుత్వం మూల్యం చెల్లిస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గతంలో శ్రీశైలంపైన ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే అడ్డుకోకుండా కేసీఆర్ ప్రభుత్వం సహకరించిందని మండిపడ్డారు. ఆనాడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశామని గుర్తుచేశారు. ఆనాడు కేసీఆర్, హరీష్‌రావు, కేటీ-ఆర్ తప్పులు చేసి వాటిని ఇప్పుడు తమపై రుద్దాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి కాపాడుకుంటామని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్టులు అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, రైతులకు అండగా నిలిచిందని చెప్పారు. సోమవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విడుదల చేశారు. జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు పాలేరు రిజర్వాయర్ నుంచి 1500 క్యూసెక్కుల సాగు నీటిని రెండో జోనుకు మంత్రులు విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఇవాళ సాగర్ రెండో జోన్‌కు సాగునీరు విడుదల చేశామని తెలిపారు.గత కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రానికి భారంగా మారాయని ఆరోపించారు. రైతులు పండించిన పంటకు పెట్టు-బడిగా రైతు భరోసా, రూ.9 వేల కోట్లు- ఇచ్చామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో సన్నవడ్లకు బోనస్ ఇచ్చామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేదని భట్టి విక్రమార్కమండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే.. వ్యవసాయం, కరెంటు-, ప్రాజెక్టులు అని అన్నారు. ఎపి ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే..మాజీ సిఎం కెసిఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. ఆనాడు తప్పిదాలు చేసిందంటే కెసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు అని తెలియజేశారు. తప్పులు చేసిన బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టు-కుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. 2,55,324 లక్షల ఎకరాలకు సాగునీటిని విడుదల చేశామని తెలిపారు. గత ఏడాది కనీవినీ ఎరుగని వరదల కారణంగా సాగర్ మెయిన్ కెనాల్ పూర్తిగా కొట్టు-కుపోయిందని.. దానిని పునరుద్ధరించామని తెలిపారు. నాగార్జున సాగర్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్‌లో వచ్చే నీటితో మొదటి పంటకు ఎలాంటి ఢోకా లేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వరుణ దేవుడి అండ ఉందని.. ఇది శు భసూచకమని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పచేసినా.. తమ ప్రభుత్వంలో రైతులకు అండగా నిలబడ్డామని నొక్కిచెప్పారు. తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు అన్నదాతల ఖాతాలో వేశామని స్పష్టం చేశారు. రైతును రాజు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. రాబోయే 5 రోజుల్లో పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరువిడుదల చేస్తామని తెలియజేశారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు పథకాలు అమలు చేస్తున్నామని, రైతుభరోసా రైతులకు ఎకరాలకు రూ.12 వేలు అందించామని, రైతుల ఖాతాల్లో 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు- జమ చేశామని చెప్పారు. సన్న ధాన్యానికి క్వింటాళ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో మిగిలిన పంటలకు కూడా బోనస్ ఇస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# కాలంకాదు..కాంగ్రెస్ కాటేస్తోంది



హైదరాబాద్:కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా చేసిన సర్కార్ నిర్లక్ష్యం వల్ల కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయని బిఆర్ఎస్ నేత కెటిఆర్ మండిపడ్డారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో వ్యవసాయాన్ని దండగ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో వచ్చిన నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతులే ప్రశ్నిస్తున్నారన్నారు. రైతులకు కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి కేటీఆర్ ఫైర్ అయ్యారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందిస్తూ.. 'కాలం కాటేయడం లేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం కాటేస్తున్నది. కరువు కాటేయడం లేదు.. కాలువల్లో నీళ్లు వారించకుండా కాంగ్రెస్ కాటేస్తున్నది. కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా కక్షగట్టిన సర్కార్ నిర్లక్షయం మూలంగా కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయి. అద్దాలమేడలో ఊరేగుతున్న అబద్దాల కాంగ్రెస్ మూలంగా అంధకారంలో తెలంగాణ రైతన్న ఆందోళన చెందుతున్నాడు. దశాబ్దాల పాలనలో దండగ చేసిన వ్యవసాయాన్ని దశాబ్ద బీఆర్ఎస్ పాలనలో పండగ చేస్తే .. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తిరిగి దండగ చేశారు. కానీ పండగల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఊరేగుతున్నది. బీఆర్ఎస్ పాలనలో వచ్చిన కాళేశ్వరం నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. దాదాపు ఆరువందల మీటర్ల ఎత్తున ఎగిసిన కాళేశ్వరం నీళ్లు సుమారు 450 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్ మండలంలో రావిచెరువు వరకు చేరి రైతుల పొలాలను తడిపిన నీళ్లు నేడెందుకు పారడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. శ్రీరాంసాగర్ కింద 2001లో పూర్తయిన కాకతీయ వరద కాలువ 22 ఏళ్ల తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల మూలంగా 153 కిలోమీటర్లు ప్రయాణించి చివరి ఆయకట్టు-కు చేరాయి. కానీ నేడు మేడిగడ్డ మరమ్మతులు చేయకుండా, కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోసి సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా, కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వ్యవసాయంపై కక్షగట్టిన కాంగ్రెస్ సర్కార్ రైతన్నలకు శిక్ష వేస్తున్నది. కాంగ్రెస్ కుట్రలను చేధిస్తాం. తెలంగాణ రైతన్నలను కాపాడుకునేందుకు నిరంతరం పోరాడతాం' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

వేగుచుక్క

# మహిళా సాధికారత" సాధనే ప్రభుత్వ లక్ష్యం.





## నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి.

## రూరల్ సెగ్మెంట్ లో ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబురాలు.

## కలెక్టర్ తో కలిసి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూలై 14 :**

మహిళా సాధికారత సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తోందని గుర్తు చేశారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలో ఇందిరా మహిళా శక్తి సంబురాలను సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. బోర్గం(పి) శివారులోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, లోన్ బీమా, బాధిత కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటుతో వ్యాపార లావాదేవీల నిర్వహణ ద్వారా సాధించిన ఆర్థిక ప్రగతి గురించి ఆయా సంఘాల మహిళా సభ్యులు వివరిస్తూ, తోటి సభ్యులలో స్ఫూర్తిని పెంపొందించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ చేపట్టిన వెనువెంటనే ఉచిత ప్రయాణాన్ని అమలులోకి తెచ్చిందని గుర్తు చేశారు. మహిళల ఉచిత ప్రయాణ చార్జీలను ప్రభుత్వమే భరిస్తోందని, 18 నెలల కాలంలోనే ఆర్టీసీకి రూ. 6500 కోట్లు చెల్లించిందని అన్నారు. మహిళా సాధికారతను కేవలం నినాదానికే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేసి చూపుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే మహిళలను లబ్దిదారులుగా ఎంపిక చేస్తూ ఇందిరమ్మ ఇళ్ళను వారి పేరిట మంజూరు చేస్తున్నామని గుర్తు చేశారు. ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేలా లబ్దిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. స్వశక్తితో మహిళలు సాధికారత దిశగా పయనించేలా సోలార్ పవర్ ప్లాంట్ లు, ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బంక్ లు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లు, మహిళా శక్తి బజార్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో బడులలో మౌలిక సదుపాయాల కల్పన పనులు, స్కూల్ యూనిఫామ్ ల స్టిచింగ్, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి అనేక అంశాలలో మహిళా సంఘాలకు అవకాశం కల్పిస్తూ వారి ఆర్థిక పురోగతికి బాటలు వేస్తోందని అన్నారు. ఏటా రూ. 25 వేల కోట్ల చొప్పున నాలుగేళ్లలో మహిళల సంక్షేమ, అభివృద్ధికి ప్రభుత్వం రూ. లక్ష కోట్లు ఖర్చు చేస్తుందని అన్నారు. కేవలం ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా రాజకీయ రంగంలో కూడా సరైన ప్రాతినిధ్యం కల్పించేలా చట్టసభలలో 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మహిళా సంఘాలకు సూచించారు.

**కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ,**

మహిళా సంఘాల ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం బ్యాంకు లింకేజీ, వడ్డీ లేని రుణాలను పెద్ద మొత్తంలో పంపిణీ చేస్తోందని అన్నారు. జిల్లాలోని 20,547 మహిళా సంఘాలకు

రూ. 21.69 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం

లోని 5781 మహిళా సంఘాలకు రూ. 5.91 కోట్ల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రమాద బీమా, బీమా లోన్, బ్యాంకు లింకేజీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని కలెక్టర్ వివరించారు. ప్రమాద బీమా అమలు వల్ల బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల బీమా పరిహారం వర్తించడంతో పాటు మహిళా సంఘం యధావిధిగా కొనసాగేందుకు బీమా దోహదపడు తుందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో మహిళల అభ్యున్నతి కోసం విస్తృత స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ వేడుకలలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, డీఆర్డీఓ సాయాగౌడ్, సొసైటీల చైర్మన్లు, జిల్లా, మండల మహిళా సమాఖ్యల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ను కలిసిన ప్రభుత్వ ప్లీడరు శ్యామ్ గోపాల్ రావు.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జులై 14:**



జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ను కలిసిన ప్రభుత్వ ప్లీడరు గా ఇటీవల నియామకం అయిన ప్రముఖ అడ్వకేట్ కె. శ్యామ్ గోపాల్ రావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కామారెడ్డి జిల్లా ఏర్పడిన తర్వాత శ్యామ్ గోపాల్ రావు మొదటిసారిగా గవర్నమెంట్ ప్లీడరు గా ఎన్నికైనందున కలెక్టర్ అభినందనలు తెలిపారు. కేసులు విషయంలో సానుకూలంగా స్పందించి తన వంతు సహకారం అందిస్తామని కలెక్టర్ అన్నారు.

## జీవనభృతి పెంపు కోసం మంత్రి సీతక్కకు వినతి.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:**



బీడీ కార్మికులకు ఎలాంటీ షరతులు లేకుండా రూ" 4016 ల జీవన భృతి ఇవ్వాలని మంత్రి సీతక్కకు తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం ఆద్వర్యంలో వినతిపత్రం అందించారు. సోమవారం ప్రజా భవన్ లో మంత్రిని కలిసినట్టు తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్ధిరాములు తెలిపారు. బీడీ పరిశ్రమ లో పనిచేస్తున్న కార్మికులందరికి 2014 ఫిబ్రవరి 28 కటాఫ్ తేదిని తొలగించి, ఎలాంటి షరతులు లేకుండా రూ" 4016 లు జీవన భృతి ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఆయన పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరపు యెల్లయ్య, గాయకుడు సోమన్న ఉన్నారు.

# 16న టీయూ రెండవ స్నాతకోత్సవం.

**వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ టి. యాదగిరి రావు వెల్లడి.**

**హాజరు కానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.**

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, జులై 14:**






తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఈ నెల 16న ప్రతిష్టాత్మకంగా జరిగే రెండవ స్నాకోత్సవాన్ని విజయవంతం చేయాలని వైస్ ఛాన్సర్, ఆచార్య టి. యాదగిరిరావు కోరారు. ఈ మేరకు సోమవారంరెండవ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వవిద్యాలయంలో కామర్స్ సెమినార్ హాల్లో వైస్ ఛాన్సర్ యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి, కంట్రోలర్ ప్రొఫెసర్ కే. సంపత్ కుమార్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్ ఛాన్సర్ యాదగిరిరావు మాట్లాడుతూ, 2006 లో 6 విభాగాలతో ప్రారంభమైన తెలంగాణ విశ్వవిద్యాలయం, నేడు 24 విభాగాలలో 31 కోర్సులకు విస్తరించిందన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయానికి బిక్నూరు పీజీ సెంటర్ , సారంగపూర్ లో ఎడ్యుకేషన్ కళాశాలతో పాటు జిల్లా వ్యాప్తంగా 109 అనుబంధ కళాశాలలు ఉన్నాయన్నారు.ఈ స్నాతకోత్సవంలో 2014 నుండి 2023 వరకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో 15,557 మంది విద్యార్థులు, గ్రాడ్యుయేషన్ లో 60, 660 మంది విద్యార్థులు, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ లో 10,079 మంది విద్యార్థులు తమ డిగ్రీలు పూర్తి చేసారని వివరించారు. ఈ స్నాతకోత్సవంలో 16 మంది దాతల సహకారంతో 16 విభాగాల నుండి మొదటి ర్యాంకు పొందిన 130 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ మరియు జూన్ 30, 2025 వరకు ఏడు విభాగాలలో పరిశోధనలు పూర్తి చేసుకున్న సుమారు 156 మంది పరిశోధకులకు పీహెచ్డీ పట్టాలు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీది నుండి ఇవ్వనున్నారని వైస్ ఛాన్సర్ తెలిపారు.ఈ స్నాతకోత్సవానికి ఐఐసిటి మాజీ డైరెక్టర్ ఆచార్య శ్రీవారి చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరుకారున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రిసెప్షన్ కమిటీ డయాస్ కమిటీ, సీటింగ్ ఏర్పాటు కమిటీ, సెనేట్ కమిటీ, ప్రింటింగ్ కమిటీ, హాస్పిటాలిటి కమిటీ, ఎంట్రీ అండ్ రెగ్యులేషన్ కమిటీ, ప్రెస్ సెండ్ మీడియా కమిటీ, ట్రాన్స్పోర్టేషన్ కమిటీ, డిస్ట్రిబ్యూషన్ కమిటీ, డిసిప్లిన్ కమిటీ, గోల్డ్ మెడల్స్ నిర్వహణ కమిటీ, క్యాంపస్ రిజర్వేషన్ కమిటీ కన్వీనర్లు

ప్రొఫెసర్ గంటా చంద్రశేఖర్, ప్రొఫెసర్ కనకయ్య, ప్రొఫెసర్ అపర్ణ, ప్రొఫెసర్ హారతి, ప్రొఫెసర్ రాంబాబు, ప్రొఫెసర్ ఆంజనేయులు, ప్రొఫెసర్ కె రవీందర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల, ప్రొఫెసర్ నాగరాజు పాత, పి ఆర్వో డైరెక్టర్ డా. ఏ పున్నయ్య లు పాల్గొన్నారు.

# ఫంక్షన్‌కి ఫైటర్ జెట్ తీసుకెళ్తారేమో..?



**తెలంగాణ:** మంత్రులు హెలికాప్టర్లను ఆటో రిక్షాలా వాడుతూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. సాధారణ ప్రయాణాలకు కూడా లక్షల్లో ఖర్చయ్యే హెలికాప్టర్లు వినియోగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సినిమా ప్రారంభోత్సవానికి రామోజీ ఫిల్మ్ సిటీకి హెలికాప్టర్‌లో వెళ్లనుండటంపై తీవ్ర చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఈ వ్యవహారంపై కోమటిరెడ్డిని ఎద్దేవా చేస్తూ ట్వీట్ చేయగా.. కేటీఆర్ దాన్ని రీట్వీట్ చేశారు. తెలంగాణలో కొందరు మంత్రులు హెలికాప్టర్లు వినియోగిస్తున్న తీరుపై ఇటీవల తీవ్ర చర్చ జరుగుతోంది. మంత్రులు హెలికాప్టర్లను ఆటో రిక్షాలా వాడుతున్నారని, అనవసర ప్రయాణాలకు కూడా వాటిని వినియోగిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్షాలు ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. సాధారణ రోడ్డు మార్గంలో సులువుగా చేరుకోగలిగే ప్రాంతాలకు కూడా హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

100-200 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు కూడా హెలికాప్టర్లలో వెళ్లడంపై విమర్శలు వస్తున్నాయి. హెలికాప్టర్ల నిర్వహణ, అద్దె ఖర్చులు చాలా ఎక్కువగా ఉంటాయని.. ఒక గంట హెలికాప్టర్ ప్రయాణానికి లక్షల్లో ఖర్చవుతుందని ఈ వ్యయం మొత్తం ప్రజల పన్నుల నుంచే భరించాల్సి వస్తుందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల పేరుతో చేసే హెలికాప్టర్ ప్రయాణాలు కేవలం ప్రచారం కోసమేనని, ఆయా కార్యక్రమాలకు రోడ్డు మార్గంలో వెళ్లినా పెద్దగా సమయం వృథా కాదని వాదిస్తున్నారు.

తాజాగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెలికాప్టర్ వినియోగంపైనా చర్చ జరుగుతోంది. సినిమాటోగ్రఫీ మంత్రిగా కూడా ఉన్న కోమటిరెడ్డి ఇవాళ రామోజీ ఫిల్మ్ సిటీ, తిరుమలగిరి పర్యటన కోసం హెలికాప్టర్‌ను ఉపయోగించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా సినిమా ప్రారంభోత్సవం వంటి కార్యక్రమానికి ప్రభుత్వ హెలికాప్టర్‌ను వాడటంపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ రోజు మధ్యాహ్నం రామోజీ ఫిల్మ్ సిటీలో ఓ సినిమా ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు. అనంతరం.. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని తిరుమలగిరిలో పబ్లిక్ మీటింగ్, రేషన్ కార్డుల పంపిణీ వంటి కార్యక్రమాలను ముగించుకొని తిరిగి బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు హెలికాప్టర్‌లో రానున్నారు. నగర శివార్లలో ఉన్న రామోజీ ఫిల్మ్ సిటీకి హెలికాప్టర్‌లో వెళ్లడంపైనే ప్రధానంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా యి. మంత్రి హెలికాప్టర్ పర్యటన షెడ్యూల్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా సెటైర్లు వేశారు. ఫంక్షన్ ఉంటే ఫైటర్ జెట్ తీసుకెళ్తారేమోనని ఎద్దేవా చేశారు. 'ఇవాళ సినిమా ఓపెనింగ్‌కి హెలికాప్టర్ ? రేపు బర్త్‌డేకి బుల్లెట్ ట్రైన్ ? ఎల్లుండి ఏదైనా ఫంక్షన్‌కి ఫైటర్ జెట్ ? అప్పు పుట్టకపోతే ఏంటి ? తెలంగాణను తాకట్టు పెడుతూ ? ప్రజల రక్తాన్ని పీల్చుతూ రాజభోగాలు అనుభవించడమే కదా కాంగ్రెస్ నైజం?' అని మల్లయ్య యాదవ్ ట్విట్టర్ వేదిగా ప్రశ్నించారు. ఈ ట్వీట్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రీట్వీట్ చేయడంతో ఈ అంశం మరింత రాజకీయ రంగు పులుముకుంది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఈ విమర్శలకు అధికార పక్షం ఎలా స్పందిస్తుందో చూడాలి.

# పెద్దపులిపై విష ప్రయోగం జరిగిందా ?.

**బతికే ఉందా అనే అనుమానాలు.**

**కామారెడ్డి జిల్లాలో కలకలం రేపుతున్న ఘటన.**

**ఫారెస్ట్ అధికారుల అదుపులో ముగ్గురు.**

**పెద్దపులి కోసం తీవ్రంగా గాలింపు.**

**డ్రోన్స్, ట్రాక్ కెమెరాల ద్వారా సెర్చ్ ఆపరేషన్.**






**వేగుచుక్క న్యూస్: కామారెడ్డి**

జిల్లాలోనీ రామారెడ్డి మండలంలో పెద్దపులి సంచారం, ఈ సందర్భంగా జరిగిన ఘటన తీవ్ర సంచలనంగా మారింది. రెడ్డిపేట తండాకు చెందిన మహిపాల్ అనే వ్యక్తి చెందిన ఆవుపై శనివారం సాయంత్రం పెద్దపులి దాడి చేసింది. దీంతో అతను ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. అధికారులు ఆదివారం ఉదయమే తండా ప్రాంతంలో పులి పాదముద్రలు సేకరించి పెద్దపులి సంచరిస్తున్నట్లుగా నిర్ధారించుకున్నారు. ఆవుపై ఈగలు వాలి చనిపోవడంతో అనుమానం వచ్చి వైద్యుడితో పరీక్ష చేయించగా గుర్తు తెలియని మందు ఆవుపై చల్లినట్టుగా అనుమానం వ్యక్తం చేస్తూ మహిపాల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఆవుపై గడ్డి మందు చల్లినట్లుగా ఒప్పుకున్నట్టు అధికారులు తెలిపారు. దీనితో మహిపాల్ పాటు అతనికి సహకరించిన సంజీవులు, గోపాల్ అనే మరో ఇద్దరిని సైతం అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే ఆవుపై పులి మళ్లీ దాడి చేసిందా.. లేదా అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. ఒకవేళ ఆవు పై మళ్లీ దాడి చేస్తే విషప్రయోగం జరిగే అవకాశాలు ఉన్నాయి.

**రెండు రోజులుగా అటవీశాఖ అధికారుల గాలింపు.**

ఫారెస్ట్ అధికారులు పెద్ద పులి జాడ కోసం గత రెండు రోజులుగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. డ్రోన్లు, ట్రాక్ కెమెరాలతో పులి జాడ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు పులిపై విషప్రయోగం జరిగిందన్న ప్రచారం ఫారెస్ట్ అధికారులను కంటికి నిదుర లేకుండా చేస్తుంది. ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పూర్తి సమాచారం తెలుసుకోవడానికి సిరికొండ, ఇందల్వాయి, కామారెడ్డి నుంచి మూడు బృందాలు పులికోసం అడవిని జల్లెడ పడుతున్నారు. అడవిలో ఆరు ట్రాక్ కెమెరాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం రెండు డ్రోన్ కెమెరాలతో అడవి మొత్తం గాలించిన ఫలితం కనిపించలేదు. పెద్ద పులి సంచరించిన ప్రాంతం మాచారెడ్డి రేంజ్ ఎల్లంపేట ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో ఉందని అధికారులు పేర్కొన్నారు. అయితే పులిపై విషప్రయోగం జరిగిందనే ప్రచారంతో అసలు పులి బతికే ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆవుపై పులి మరోసారి దాడి చేయకపోతే జిల్లా శివారు దాటి ఉండొచ్చన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. శివారు దాటితే మాత్రం అధి కారులు ఊపిరి పీల్చుకునే అవకాశాలు ఉన్నాయి.



# రన్నింగ్ బైక్‌పై రొమాన్స్..



**హైదరాబాద్:** ఆరాంఘర్ ఫ్లైఓవర్‌పై ఓ ప్రేమజంట రెచ్చిపోయింది. నడిరోడ్డుపైనే అశ్లీల చేష్టలకు పాల్పడింది. బైక్ ట్యాంక్‌పై కూర్చున్న యువతితో యువకుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీసుల పర్యవేక్షణ పెంచాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.ఇటీవల కాలంలో యువ జంటలు బహిరంగ ప్రదేశాల్లో, ముఖ్యంగా రన్నింగ్ బైక్‌లపై అసభ్యకరంగా ప్రవర్తించడం, ప్రమాదకరమైన స్టంట్స్ చేయడం ఆందోళన కలిగిస్తోంది. ప్రైవేటుగా చేసుకోవాల్సిన పనులను సైతం నడిరోడ్లపైనే చేయడం, హద్దు మీరి ప్రవర్తించడం వంటివి సమాజంలో చర్చనీయాంశంగా మారాయి. ఇలాంటి వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతూ ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తు న్నాయి. హైదరాబాద్ నగరంలో చోటు చేసుకున్న ఒక ఘటన ఈ సమస్య తీవ్రతను స్పష్టం చేస్తోంది. ఆరాంఘర్ ఫ్లైఓవర్‌పై ఒక యువ జంట బరి తెగించింది. యువకుడు బైక్‌ను నడుపుతూ.. తన ప్రియురాలిని ముందు ట్యాంక్‌పై కూర్చోబెట్టుకుని అభ్యంతరకర రీతిలో ప్రవర్తిస్తూ వీడియో తీసుకున్నారు. వెనకాలో బైక్ ప్రయాణించిన ఓ వాహనాదారుడు వారి రొమాన్స్‌ను సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. నడిరోడ్డుపై ఎవరైనా చూస్తారన్న భయం కూడా లేకుండా ఆ జంట రెచ్చిపో యింది. వాహనదారులను ఏమాత్రం పట్టించుకోకుండా తమ పనిలో నిమగ్నమ య్యారు. ట్రాఫిక్ నిబంధనలను గాలికొదిలేసి ప్రమాదక రంగా ప్రయాణించిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# సరోజ మృతిపై తెలుగు ప్రముఖుల సంతాపం



తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లో లెజెండరీ నటిగా గుర్తింపు పొందిన బి.సరోజా దేవి (87) సోమవారం బెంగళూరులో కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మృతిపై టాలీవుడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. "భూకైలాస్, పాండురంగ మహత్యం, శకుంతల, దాన వీర శూర కర్ణ" వంటి క్లాసిక్ చిత్రాల్లో ఎన్టీఆర్, ఏఎన్నార్‌తో కలిసి నటించిన ఆమె అన్ని భాషల్లోనూ లేడీ సూపర్‌స్టార్ హోదాను ఆస్వాదించారు. ఆమె మృతికి పవన్ కళ్యాణ్, నందమూరి బాలకృష్ణ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఎన్నో చిత్రాల్లో నటించి మెప్పించిన అలనాటి నటి బి.సరోజా దేవి సోమవారం కన్నుమూశారు. తెలుగులోనూ ఎన్టీఆర్, ఏఎన్నార్‌లతో ఎన్నో చిత్రాల్లో నటించి ఆమె ఆ కాలంలో సౌత్‌లో లేడీ సూపర్‌స్టార్ హోదాను అనుభవించారు. భారతీయ సినీ చరిత్రలో అత్యంత విజయవంతమైన హీరోయిన్లతో ఒకరిగా, ఆ కాలంలో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకున్న నటిగా ప్రసిద్ధి చెందారు. మాతృభాష అయిన కన్నడ చిత్రం 'మహాకవి కాళిదాసు'తో తెరంగ్రేటం చేసినా తెలుగు, తమిళ భాషల్లోనే ఎక్కువ చిత్రాల్లో నటించడం విశేషం. ఇక తమిళంలో అయితే ఆనాటి హీరోలైన ఎంజీఆర్, శివాజీ గణేషన్, జెమినీ గణేషన్‌లతో వరుస చిత్రాలు చేశారు. ఆ కాలంలో హీరో ఎవరైనా హీరోయిన్ మాత్రం బి.సరోజనే అనేంతగా ఖ్యాతి గడించారు.

'పాండురంగ మహత్యం'తో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన ఆమె భూకైలాస్, పెళ్లి సందడి, పెళ్లి కానుక, సీతారామ కళ్యాణం, జగదేకవీరుని కథ, ఇంటికి దీపం ఇల్లాలే, మంచి చెడు, శ్రీకృష్ణార్జున యుద్ధం, దాగుడు మూతలు, ఆత్మ బలం, అమరశిల్పి జక్కన్న, ప్రమీలార్జునీయం, శకుంతల, రహస్యం, భాగ్యచక్రం, ఉమా చండీ గౌరీ శంకరుల కథ, పండంటి కాపురం, శ్రీరామాంజనేయ యుద్ధం, దాన వీర శూర కర్ణ, అల్లుడు దిద్దిన కాపురం.. తదితర చిత్రాల్లో నటించారు. తెలుగులో ఎన్టీఆర్-బి.సరోజ జోడీ హిట్ పెయిర్ ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయింది. పెళ్లయి, పిల్లలు పుట్టిన తర్వాత కూడా ఎన్నో చిత్రాల్లో నటించిన ఆమె భర్త మరణం తర్వాత సినిమాలకు పూర్తిగా దూరమైపోయారు. 87 ఏళ్ల వయసులో వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ సోమవారం బెంగళూరులో కన్నుమూశారు. దీంతో తెలుగు సినీ పరిశ్రమ ఆమెకు ఘనంగా నివాళు లర్పిస్తోంది.

ప్రముఖ నటి శ్రీమతి బి.సరోజాదేవి గారు కన్నుమూశారని తెలిసి బాధపడ్డాను. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. 1955 నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగు, కన్నడ, తమిళ భాషా చిత్రాల్లో నటించి చిత్రసీమపై తనదైన ముద్రను వేశారు. భూకైలాస్, పాండురంగ మహత్యం, సీతారామ కళ్యాణం, జగదేకవీరుని కథ, శకుంతల, దానవీర శూర కర్ణ, ఆత్మబలం లాంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించారు. శ్రీమతి బి.సరోజా దేవి గారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను

– పవన్ కళ్యాణ్





దక్షిణ భారత సినీ పరిశ్రమలో ఒకనాడు ధ్రువతారగా వెలుగొందిన ప్రముఖ నటీమణి "పద్మభూషణ్" బి. సరోజాదేవి గారు పరమపదిం చారన్న వార్త అత్యంత బాధాకరం. అప్పట్లో తెలుగులో NTR గారితో, తమిళంలో MGR గారితో, కన్నడంలో రాజ్ కుమార్ గారితో ఏకకాలంలో హిట్ పెయిర్‌గా వెలుగొందిన ఘనత ఆమెది. మా తండ్రి NTR గారి కాంబినేషన్లో 20 సంవత్సరాల కాలంలో దాదాపు 20 చిత్రాలలో హీరోయిన్‌గా నటించారు. ఆయనతో శ్రీరాముడి ప్రక్కన సీతాదేవిగా, రావణాసురుడి ప్రక్కన మండోదరిగానూ నటించిన ప్రత్యేకత ఆమె సొంతం. శ్రీమతి బి. సరోజా దేవి మరణం భారతీయ చిత్ర పరిశ్రమకు, ముఖ్యంగా దక్షిణ భారత చిత్ర పరిశ్రమకు తీవ్ర విచారకరమైన పరిణామం. ఆమె వెండితెరపై మరియు నిజజీవితంలో చేసిన సేవలు రాబోయే తరాల తారలకు, చలనచిత్ర వర్గాల వారికి స్ఫూర్తినిస్తాయి. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను

– నందమూరి బాలకృష్ణ

# వినట్లేదెందుకు హరి హరా!!



చరిత్ర గురించి తెలుసుకోవాలనే ఆసక్తి అందరికీ ఉంటుంది. ఇప్పటి వరకూ భారతీయ చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబించే అనేక చారిత్రక చిత్రాలు వచ్చాయి. రాజులు, యుద్ధాలు, వీరులు, పోరాటాలు, గత కాలపు సంఘటనలు, సామాజిక పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపించిన సినిమాలకు విశేషమైన ప్రేక్షకాదర దక్కింది. అందులో ఆంధ్రప్రదేశ్ ప్రాచీన చరిత్ర, తెలంగాణ సాయుధ పోరాటాలకు సంబంధించిన చిత్రాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు 'హరి హర వీరమల్లు' వంటి హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ మూవీ ఆడియన్స్ ను అలరించడానికి వస్తోంది.

**ఐదేళ్లుగా నిర్మాణ దశలో...**

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన సినిమా 'హరి హర వీరమల్లు'. ఇది ఆయన కెరీర్ లోనే భారీ బడ్జెట్ మూవీ. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఏఎం రత్నం భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో 2020 జనవరిలో ఈ చిత్రం అధికారికంగా ప్రకటించబడింది. అదే ఏడాది సెప్టెంబర్ లో సెట్స్ మీదకు వెళ్లిన ఈ సినిమా.. కోవిడ్ పాండమిక్, పవన్ క్రియాశీలక రాజకీయాలు ఇతరత్రా కారణాలతో ఆలస్యమవుతూ వచ్చింది. మధ్యలో క్రిష్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో, నిర్మాత ఏఎం రత్నం కొడుకు జ్యోతి కృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఒక్క కథను రెండు భాగాలుగా రూపొందించాలని నిర్ణయించుకున్నారు. 'హరి హర వీరమల్లు: స్వోర్డ్ అండ్ స్పిరిట్' పేరుతో ఫస్ట్ పార్ట్ రిలీజ్ కానుంది.

'హరి హర వీరమల్లు' పార్ట్-1 సినిమా ఇప్పటికే అనేకసార్లు వాయిదా పడింది. బహుశా తెలుగు చిత్ర పరిశ్రమలో అత్యధికసార్లు వాయిదా పడిన చిత్రం ఇదే అనుకుంటా. ఎన్నో వ్యవప్రయాసలు పడి ఎట్టకేలకు సినిమాని విడుదలకు సిద్ధం చేశారు. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో రిలీజ్ చేస్తున్నారు. తెలుగుతో పాటుగా తమిళం మలయాళం కన్నడ హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ కు అభిమానుల నుంచి మంచి స్పందన లభించింది. ముందు పెద్దగా బజ్ లేదు కానీ.. ట్రైలర్ వచ్చిన తర్వాత హైప్ క్రియేట్ అయింది. అదే సమయంలో కొన్ని వివాదాలు కూడా చుట్టుముట్టాయి.

**చారిత్రక యోధుడిగా పవన్ కళ్యాణ్ ...**

'హరి హర వీరమల్లు' ఫస్ట్ గ్లింప్స్ లో పవన్ కళ్యాణ్ మునుపెన్నడూ చూడని విధంగా ఒక చారిత్రక యోధుడి పాత్రలో కనిపించడంతో, ఈ సినిమా స్టోరీపై అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. 17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో ఒక పీరియడ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోందని వార్తలు వచ్చాయి. కోహినూర్ వజ్రం చుట్టూ కథ నడుస్తుందని, పవన్ ఒక రాబిన్ హుడ్ తరహా పాత్రలో కనిపించనున్నారని చెప్పుకున్నారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్ ని చూపించడంతో నిజమైన చరిత్ర ఆధారంగానే చిత్రీకరించారని అనుకున్నారు. అదే సమయంలో తెలంగాణ పోరాట వీరుడు పండుగ సాయన్న జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమాను తీశారనే టాక్ నడిచింది.

నిజాం పాలనలో జరిగిన తిరుగుబాట్లు, ఉద్యమాలలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ప్రజా నాయకుడు పండుగ సాయన్న. ఈయన సుమారు 1860 – 1900 మధ్య కాలంలో జీవించి ఉండవచ్చని చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని నవాబ్‌పేట మండలం, మెరుగోనిపల్లె గ్రామం ఆయన జన్మస్థలం. ధనవంతులను, భూస్వాములను, నిరంకుశ నిజాం అధికారులను ఎదిరించి పేద ప్రజలకు దానధర్మాలు చేసి 'తెలంగాణ రాబిన్‌హుడ్' గా పేరుగాంచారు. ధనవంతుల ఇళ్లపై, గోదాములపై దాడులు చేసి.. ఆ ఆహార ధాన్యాలను ఆకలితో అలమటించే పేద ప్రజలకు పంచిపెట్టేవారు. ఆయన కథ ఆధారంగానే వీరమల్లు పాత్రని క్రియేట్ చేసారని టాక్ వచ్చింది.

**హరి హర రాయలు కథతో వీరమల్లు..**

'హరి హర వీరమల్లు' అనే టైటిల్ కారణంగా హరి హర రాయలు కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కిందనే వార్తలు వచ్చాయి. సంగమ వంశానికి చెందిన హరి హర రాయలు.. క్రీ.శ. 1336లో విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. మొదటి హరిహర రాయలు కేవలం ఒక రాజ్య స్థాపకుడిగానే కాకుండా, దక్షిణ భారతదేశంలో హిందూ సంస్కృతి, ధర్మాన్ని రక్షించి, భవిష్యత్ తరాలకు గొప్ప వారసత్వాన్ని అందించిన ఒక విజనరీ పాలకుడిగా చరిత్రలో నిలిచిపోయారు. ఆయన కథని స్ఫూర్తిగా తీసుకునే వీరమల్లును తెరకెక్కిస్తున్నారని వార్తలు వచ్చాయి.

**వీరమల్లు వివాదాలు...**

'హరి హర వీరమల్లు' సినిమా తెలంగాణ బందూక్, తెలంగాణ పోరాట యోధుడు, ప్రజావీరుడు పండుగ సాయన్న జీవిత కథను పోలి ఉందని, చరిత్రను వక్రీకరిస్తున్నారని బీసీ సంఘాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇది పండుగ సాయన్న సాయన్న స్టోరీ కాదని, విజయ నగరం సామ్రాజ్యం స్థాపించిన హరి హర రాయలు బుక్క రాయల కు సంబంధించిన కథ అని చెప్తున్నారని ఆరోపించారు. 1406-10 మధ్య కాలంలోనే హరి హర రాయలు శకం ముగిసిందని, కానీ ట్రైలర్ లో 1650 – 1707 మధ్య జీవించిన ఔరంగజేబుతో పవన్ కళ్యాణ్ యుద్ధం చేసినట్లు చూపించారని, 1591లో కులీ కుతుబ్ షాహీ కట్టించిన చార్మినార్ కనిపించిందని, ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. చరిత్రను వక్రీకరించి తీస్తున్న ఈ సినిమా విడుదలను అడ్డుకుంటామని హెచ్చరించారు. దీనిపై మేకర్స్ వివరణ ఇచ్చారు.

# రవితేజ చంపేస్తా అన్నాడు..



యువ దర్శకుడు సందీప్ రాజ్ తన రాబోయే ప్రాజెక్ట్‌లపై ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 'కలర్ ఫోటో' తర్వాత రవితేజతో సినిమాకు ప్రయత్నించినా, అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం యాంకర్ సుమ కొడుకు రోషన్ కనకాలతో 'మౌగ్లీ' అనే సినిమాను తెరకెక్కిస్తున్నారు. రవితేజతో సినిమా ఆలస్యం కావడంతో, యూత్‌ఫుల్ లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సందీప్ తెలిపారు. టాలీవుడ్ లో యువ దర్శకుడిగా, రచయితగా, నటుడిగా మల్టీ టాలెంటెడ్ అనిపించుకున్నారు సందీప్ రాజ్. షార్ట్ ఫిల్మ్స్‌తో కెరీర్ ప్రారంభించిన ఆయన, 2020లో 'కలర్ ఫోటో' సినిమాతో డైరెక్టర్ గా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. డెబ్యూ మూవీతోనే నేషనల్ ఫిలిం అవార్డును గెలుచుకొని అందరి దృష్టిని ఆకర్షించారు. ఇప్పుడు తన నిర్మాణంలో '%బా×=% – ఆల్ ఇండియా ర్యాంకర్స్' అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ప్రమోషన్స్ లో భాగంగా తన అప్ కమింగ్ ప్రాజెక్ట్స్ పై మాట్లాడారు. 'కలర్ ఫోటో' లాంటి నేషనల్ అవార్డ్ ఫిలిం తీసిన తర్వాత కూడా సందీప్ రాజ్ కు దాదాపు ఐదేళ్ల గ్యాప్ వచ్చింది. ప్రస్తుతం యాంకర్ సుమ కొడుకు రోషన్ కనకాలతో 'మౌగ్లీ' అనే మూవీని డైరెక్ట్ చేస్తున్నారు. రెండో సినిమా తెరకెక్కించడానికి ఇన్నేళ్ల గ్యాప్ తీసుకుపోవడం, అది కూడా ఒక యంగ్ హీరోతో చేయడంపై సందీప్ స్పందించారు. చాలామంది పెద్ద హీరోలకు కథలు చెప్పానని, కానీ అవన్నీ పెద్ద సినిమాలు కావడంతో బడ్జెట్లు సెట్ అవ్వలేదని తెలిపారు. రవితేజతో ఓ సినిమా కోసం దాదాపు మూడేళ్లపాటు ట్రావెల్ చేసానని దర్శకుడు చెప్పారు.


"నేను ఎవరి దగ్గరకు వెళ్లినా వాళ్లని మించిన కథను తీసుకొని వెళు న్నాను. దాని వల్ల బడ్జెట్ సెట్ అవ్వడం లేదు. ఒక సినిమా కోసం హీరో రవితేజతో ట్రావెల్ చేశాను. అయితే ఈ ఏడాది కూడా ఆయన బిజీగా ఉన్నారు. 'అనవసరంగా నీ గోల్డెన్ టైం అంతా వేస్ట్ చేసుకుంటున్నావ్.. నాకు రెండు కమిట్మెంట్స్ ఉన్నాయి. అర్థం చేసుకో అబ్బాయ్' అని రవితేజ నాతో అన్నారు. అప్పటికే మూడేళ్లు అయింది. నేను ఇంకో కథ రాసుకోవడం స్టార్ట్ చేస్తాను అని చెప్పాను. ఎక్కువ టైం వేస్ట్ చేసుకోకుండా హ్యాపీగా చేసుకొని రమ్మన్నారు" అని సందీప్ రాజ్ తెలిపారు. అయితే తనకు చెప్పిన కథను ఎప్పటికైనా తనతోనే చేయాలని రవితేజ చెప్పారన్నారు. "నాకు చెప్పిన కథ ఇంకెవరితో అయినా తీస్తే చంపేస్తాను.. నాతోనే తీయాలి అని రవితేజ అన్నారు. అది మీకోసమే రాసిన స్టోరీ అని చెప్పాను. నాలుగేళు ్లగా తన మైండ్ లో ఉన్నదంతా తీసేసి, ఫ్రెష్ గా ఈసారి థియేట్రికల్ డెబ్యూ చేస్తున్నానని అనుకోని ఒక యూత్ ఫుల్ లవ్ స్టోరీ రాయాలని నిర్ణయించుకున్నా. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో మొత్తం న్యూ సెటప్ లో చేద్దాం అని అనుకున్నా. ఈ ప్రాసెస్ లో ఉన్నప్పుడు రోషన్ కనకాల నటించిన 'బబుల్ గమ్' మూవీ రిలీజయింది. ఫస్ట్ సినిమాలోనే అంత కాన్ఫిడెంట్ గా చేసాడు. పర్ఫెక్ట్ గా ఉన్నాడనిపించింది. ఒక గంటలోనే మీటింగ్ అయిపోయింది. ఇద్దరం కలిసి చేద్దాం అనుకున్నాం. వెంటనే ప్రాజెక్ట్ సెట్ అయింది" అని సందీప్ రాజ్ చెప్పారు.

# ఏళ్లుగా కాపురం.. చివరికి విడాకులు



కలకాలం కలిసి ఉంటామని ఒక ఆడ, మగ కలిసి చేసుకునే ప్రమాణమే పెళ్లి. కానీ, గత కొంతకాలంగా పెళ్లి చేసుకుని విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇక సెలబ్రిటీల పెళ్లిళ్లు ఎంత ఆసక్తిని పెంచుతున్నాయో.. వారి విడాకులు అంతకంటే ఎక్కువ చర్చకు దారితీస్తున్నాయి. ఎన్నో ఏళ్లు ప్రేమించుకుని, చివరికి పెళ్లి చేసుకున్నా.. ఎక్కువ రోజులు కలిసి ఉండలేక విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య భారీగా ఉంటోంది. ఇక మరికొన్ని స్టార్ కపుల్స్ అయితే.. ఎన్నో ఏళ్లు కలిసి కాపురం చేసి, చివరికి ఎవరి దారి వారు చూసుకుంటున్న ఘటనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గత కొంతకాలంగా విడాకులు తీసుకున్న సెలబ్రిటీ జంటలు ఏవి? అసలు ఈ స్టార్ కపుల్స్ విడిపోవడానికి కారణాలు ఏంటి? వివరాలు..













గత కొంతకాలంగా దేశంలో సెలబ్రిటీ విడాకుల ఘటనలు బాగా పెరుగుతున్నాయి. నూరేళ్లు కలిసి ఉంటామని పెళ్లిళ్లు చేసుకుంటున్నా.. కొన్ని రోజులు కూడా కలిసి ఉండటం లేదు. ప్రేమించుకుని, పెళ్లి చేసుకుని అంతా హ్యాపీగా ఉంది అనుకునే సమయంలో విడాకుల ప్రకటన చేయడం.. ఫ్యాన్స్ జీర్ణించుకోలేకపోతున్నారు. పెళ్లిళ్ల సీజన్లో కొత్త జంటల ఫోటోలు ఎంత వైరల్ అవుతున్నాయో.. ఇప్పుడు విడాకుల వార్తలు కూడా అంతే ఫాస్ట్‌గా వచ్చేస్తున్నాయి. ఒకప్పుడు ఏడడుగుల బంధం అంటే ఏడు జన్మల బంధం అని భావించేవారు.. కానీ, ఇప్పుడు మాత్రం 7 ఏళ్లు కలిసి ఉంటే అదే గొప్ప అనేంతగా పెళ్లిళ్లు మారిపోతున్నాయి. సినిమా, స్పోర్ట్స్, బిజినెస్.. ఇలా ఏ రంగంలో చూసినా స్టార్ కపుల్స్ తమ పెళ్లి బంధానికి గుడ్‌బై చెప్పి.. విడాకుల అనౌన్స్‌మెంట్ చేసేస్తున్నారు. ఇక సెలబ్రిటీల పెళ్లిళ్లు అంటే.. కోట్లకు కోట్లు ఖర్చు పెట్టి చేసుకుని.. కొన్ని నెలలు, కొన్ని సంవత్సరాలకే.. 'మాకొద్దు బాబోయ్ ఈ దాంపత్య జీవితం' అంటూ.. విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కుతున్నారు.

సెలబ్రిటీల విడాకులకు అనేక కారణాలు ప్రభావితం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుత తరం సెలబ్రిటీలు తమ వ్యక్తిగత జీవితానికి, స్వేచ్ఛకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వివాహ బంధంలో సర్దుకుపోవడం కంటే.. తమ సంతోషానికి ప్రాధాన్యత ఇవ్వడానికి వెనుకాడటం లేదు. సినిమా, క్రీడా, వ్యాపార రంగాల్లో ఉన్నవారికి కెరీర్ ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుంది. నిరంతరం


















ప్రయాణాలు, షూటింగ్ షెడ్యూల్స్, వ్యాపార లావాదేవీలు వంటివి వ్యక్తిగత సంబంధాలపై ప్రభావం చూపడం వల్ల భార్యాభర్తల మధ్య దూరం ఏర్పడుతోంది.

సెలబ్రిటీల జీవితంపై మీడియా, సోషల్ మీడియా ఎప్పుడూ దృష్టి పెడతాయి. సెలబ్రిటీలకు సంబంధించిన ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో పెట్టి విశ్లేషిస్తారు. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితంలోకి అతిగా చొచ్చుకువెళ్లడం వారి బంధాలపై ఒత్తిడిని పెంచుతుంది. మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా ఉండటం వల్ల, బంధంలో ఇమడలేనప్పుడు విడిపోవడానికి వెనుకాడటం లేదు. విడాకుల పట్ల సమాజంలో గతంలో ఉన్న చిన్నచూపు ఇప్పుడు తగ్గుతోంది. విడాకులు తీసుకోవడం అంటే గతంలో పెద్ద తప్పుగా భావించేవారు. ఇది వ్యక్తిగత నిర్ణయంగా.. పరిస్థితుల ప్రభావంగా ప్రస్తుత సమాజం చూస్తోంది.

టీమిండియా క్రికెటర్ మహమ్మద్ షమీ, హసిన్ జహాన్ విడిపోయారు. 2018లో హసిన్ జహాన్.. షమీపై గృహహింస, వరకట్న వేధింపులు, వివాహేతర సంబంధం ఉందని సంచలన ఆరోపణలు చేశారు. నాటి నుంచి షమీ, జహాన్ మధ్య విడాకులు, భరణం విషయంలో చట్టపరమైన పోరాటం కొనసాగుతోంది. జహాన్‌కు, వారి కుమార్తెకు నెలకు రూ.4 లక్షల భరణం చెల్లించాలని ఇటీవల కలకత్తా హైకోర్టు ఆదేశించింది. జహాన్‌కు రూ.1.5 లక్షలు, వారి కుమార్తె ఖర్చుల కోసం రూ.2.5 లక్షలు కేటాయించారు.